క్లుప్తంగా

పొలాలను సందర్శించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: వ్యవసాయ శాఖ అధికారులు పొలాల సందర్శనకు రైతుల దగ్గరకు వెళ్లడం లేదని, వారి పంటలకు సంబంధించిన సలహాలను, సూచనలను ఇవ్వడం పూర్తిగా మరిచారని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎన్. రవి శంకర్ రెడ్డి ఆరోపించారు. గురువారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా వల్లూరు, చింతకొమ్మదిన్నె, చెన్నూరు, మండలాలలోని కొన్ని పొలాలను పరిశీలించగా చీని తోటలు, మామిడి, కంది, పెసర, ఉలవ మొదలైన తోటలలో అధిక సమస్యలు ఉన్నాయని, వారికి ఏ ఏ మందులు ఉపయోగించాలో తెలియడం లేదన్నారు. రెండవ కారులో ఒక నెల వయసున్న వరి పంటలో పలు సమస్యలు ఉన్నాయన్నారు. వ్యవసాయ అధికారులు పంటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి సిద్ధరామయ్య పాల్గొన్నారు.


18, 19 తేదీల్లో రజతోత్సవాలు

కడప కల్చరల్ : కడప రెడ్డిసేవా సమితి రజతోత్సవాలను ఈనెల 18, 19 తేదీల్లో నగర పరిధిలోని డీఎస్‌ఆర్ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి లెక్కల కొండారెడ్డి, సభ్యులు పద్మప్రియ చంద్రారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా 18న మేలుకొలుపు పేరిట ప్రచురించనున్న రజతోత్సవ ప్రత్యేక సంచికను ముఖ్య అతిథులు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. 19న ఉదయం 10 గంటలకు రాజీవ్‌మార్గ్‌లోని రెడ్డి సేవా సమితి కార్యాలయం వద్ద నుంచి వేమన విగ్రహం వరకు ర్యాలీ నిర్వహిస్తామని, అనంతరం వేమన విగ్రహానికి పూలమాల అలంకరిస్తామని తెలిపారు.

ప్రధాని మోడీ పాలన విధ్వంసకరం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విధ్వంసకర పరిపాలన చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అఫ్జల్ ఖాన్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని 31వ డివిజన్‌లో జై బాపూజీ.. జై భీమ్ జై సం విధాన్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం దేశంలోని ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేసిందని, కేవలం మత ప్రాతిపదికన భారతదేశ సమాజాన్ని చీల్చి అధికార పబ్బం గడుపుతున్నారని ధ్వజమెత్తారు. ఇటీవల పార్లమెంటులో బి.ఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన అమానుష వ్యాఖ్యలు దీనికి నిదర్శనం అన్నారు. అనంతరం స్థానిక రెండో గాంధీ విగ్రహం వద్ద గోడ పత్రాలను కాంగ్రెస్ పార్టీ నేతలు ఆవిష్కరించారు. తదనంతరం కాంగ్రెస్ పార్టీ కరపత్రాలను ప్రజలకు పంచుతూ బీజేపీ చేస్తున్న దుర్మార్గపు పాలనను ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు రహమతుల్లా ఖాన్, సీనియర్ నేతలు వెంకటేష్, సిరాజుద్దీన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పుత్తా పుల్లారెడ్డికి భూతపురి స్మారక పురస్కారం


పుత్తా పుల్లారెడ్డి

కడప కల్చరల్ : మహాకవి, శతావధాని డాక్టర్ భూతపురి సుబ్రమణ్య శర్మ 23వ స్మారక సాహిత్య పురస్కారానికి ప్రసిద్ధ సాహితీవేత్త, కడపకు చెందిన పుత్తా పుల్లారెడ్డి ఎంపికయ్యారు. గురువారం డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ మెమోరియల్ ట్రస్టు కార్యదర్శి డాక్టర్ భూతపురి శివరామసురేంద్రశర్మ ఈ వివరాలను విలేకరులకు తెలిపారు. సుబ్రమణ్యశర్మ ట్రస్టుతోపాటు అల్లసాని పెద్దన సాహితీపీఠం కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 16న కడప నగరం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో భూతపురి 88వ జయంతి కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. ఇంజనీరుగా పదవీ విరమణ చేసిన అనంతరం పుత్తా పుల్లారెడ్డి సాహితీరంగంలో అడుగిడి అనేక పరిశోధనాత్మక రచనలు చేశారని, వ్యాఖ్యానాలు, సంకలన గ్రంథాలు, వచన రచనలు వెలువరించారన్నారు.

సర్పంచుల సమస్యలు పరిష్కరించాలి

కడప సెవెన్‌రోడ్స్ : సర్పంచుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షులు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్‌వర్మ, షేక్ అల్లాబకాష, అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు గురువారం పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజకు విన్నవించారు. గ్రామ పంచాయతీలకు రిజిస్ట్రేషన్ శాఖ నుంచి రావాల్సిన సర్‌ఛార్జీలు విడుదల చేయాలని, కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి రావాల్సిన నిధులను ఇవ్వాలని కోరారు. సర్పంచులకు కొన్ని నెలలుగా బకాయి ఉన్న గౌరవ వేతనాలను విడుదల చేయాలన్నారు.

ఎట్టకేలకు ఎజెండా ఆమోదం

- అభివృద్ధికి టీడీపీ అడుగడుగునా ఆటంకం
- పట్టుబట్టి పైచేయి సాధించిన నగర పాలకవర్గం
- ఉత్కంఠ రేపిన వరుస పరిణామాలు



కడప కార్పొరేషన్: 2024 డిసెంబర్ 23వ తేది జరిగిన కడప నగరపాలక సర్వసభ్య సమావేశంలో ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి, పార్టీ ఫిరాయించిన కార్పొరేటర్లు కుర్చీ కోసం చేసిన గందరగోళం తెలిసిందే. అయితే ఈ నేపథ్యంలో నినాదాల మధ్యే మూజువాణి ఓటుతో ఎజెండాలోని అంశాలన్నీ ఆమోదించినట్లు మేయర్ సురేష్ బాబు ప్రకటన చేసిన విషయం పాఠకులకు విదితమే. అయితే ఆ తర్వాత జరిగిన పరిణామాలు నగరవాసులకు ఉత్కంఠను రేపాయి. సర్వసభ్య సమావేశం జరిగిన మరుసటి రోజే సెక్రటరీ ఆమోదించిన అంశాలను మినిట్స్ బుక్‌లో రాసి కమిషనర్, సెక్రటరీలు సంతకాలు చేయాల్సి ఉంది. అయితే రెండు వారాల పాటు వారు ఒకరి తర్వాత ఒకరు సెలవులో వెళ్లిపోవడంతో ఆలస్యమైంది. 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు కావాలంటే నిర్దేశించిన గడువులోపు అధికారులు ప్రతిపాదనలను సర్వసభ్య సమావేశంలో ఆమోదింపజేసుకొని ప్రభుత్వానికి పంపాల్సి ఉంది. కానీ ఇక్కడ అందుకు విరుద్ధంగా జరిగింది. దీంతో రూ.15కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు కావడం ప్రశ్నార్థకంగా మారింది. టీడీపీ సభ్యులు అడుగడుగునా అడ్డుతగిలి పలు సార్లు ఎజెండాను చించివేసినా...38 మంది సభ్యు లం ఏకగ్రీవంగా ఆమోదించిన ఎజెండాను మినిట్స్ బుక్‌లో ఆమోదించాలని ఈనెల 7వ తేది వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు కమిషనర్ మనోజ్‌రెడ్డికి, స్టాండింగ్ కౌన్సిల్ సుధాకర్ బాబ్జీకి వినతి పత్రాలు కూడా సమర్పించారు. ఆ తర్వాత కూడా నగరవాసులకు ఎన్నో అనుమానాలు, ప్రశ్నలు తలెత్తాయి. ఎజెండాను ఆమోదించినట్టా...లేదా... దీనిపై కమిషనర్ సంతకాలు చేస్తారా...చేయరా...లీగల్ ఓపీనియన్ సానుకూలంగా వస్తుందా...రాదా అనే ఊహాగానాల మధ్య...ఉన్నత న్యాయస్థానాన్ని అయినా ఆశ్రయించి ఎజెండాను ఆమోదించుకోవాలని మేయర్, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో...24 రోజుల విరామం తర్వాత ఎట్టకేలకు ఎజెండాలోని అంశాలన్నీ మినిట్స్ బుక్‌లో రాసి కమిషనర్, సెక్రటరీలు సంతకాలు చేసినట్లు తెలుస్తోంది. న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే తమ కు మొట్టికాయలు తప్పవనే అధికారులు హుటాహుటిన ఈ అంశాలను మినిట్స్‌లో రాసి సంతకాలు తీసుకున్నట్లు సమాచారం.

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మేయర్, కార్పొరేటర్లు నగరాభివృద్ధికి కట్టుబడి ఉన్నారు కాబట్టే ఎజెండాను ఏకగ్రీవంగా ఆమోదించడమే గాక, పట్టుబట్టి మినిట్స్ బుక్‌లో రాయించి సంతకాలు చేయించారని పలువురు అభిప్రాయపడుతున్నారు. అలాగే టీడీపీకి చెందిన ప్రభుత్వ విప్ మాధవి, పార్టీ ఫిరాయించిన కార్పొరేటర్లు అభివృద్ధి నిరోధకులు కాబట్టే కుర్చీ కోసం కొట్లాడి సభ జరగనీయకుండా అడ్డుపడ్డారని, సాంకేతిక కారణాలు చూపి ఆ అంశాలను మినిట్స్ బుక్‌లో రాయకుండా అధికారులపై ఒత్తిడి తెచ్చి ఆటంకాలు సృష్టించారని పేర్కొంటున్నారు.

తప్పని తిప్పలు






వైద్య ఆరోగ్యశాఖ రాయలసీమ రీజియన్ పరిధిలో స్టాఫ్ నర్సుల ఉద్యోగాల భర్తీ నేపథ్యంలో అధికారులు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. గత కొన్ని రోజులుగా అభ్యర్థులు కడప నగరం పాత రిమ్స్‌లోగల వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి చేరుకుని దరఖాస్తులు సమర్పిస్తున్నారు. అయితే అధికారులు అభ్యర్థులకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు ఇసుకలోనే కూర్చుని దరఖాస్తులు పూరిస్తున్నారు. ముఖ్యంగా చిన్నారుల తల్లులు దరఖాస్తులు సమర్పించేందుకు వచ్చి ఇక్కట్లు పడుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలి


శనగ పంటను పరిశీలిస్తున్న ఏడీఏ, ఏఓ

కమలాపురం : ప్రతి రైతు పంటల సాగుకు 24 గంటల ముందే విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలని ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ సరస్వతి తెలిపారు. గురువారం మండలంలోని ఎల్లారెడ్డిపల్లె, వంకమాడ గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వారు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. రైతులకు సలహాలు సూచనలు అందజేశారు. పంటల సాగుకు 24 గంటల ముందే ప్రతి రైతు విత్తన శుద్ధి తప్పని సరిగా చేసుకోవాలన్నారు. అలగే రైతులు ఇ-పంటను నమోదు చేసుకోవడంతో పాటు ఇ-కేవైసీ చేసుకోవాలన్నారు. జనవరి, ఫిబ్రవరి మాసాల్లో నూగు, పెసర, వేరు శనగ పంటలను విత్తు కోవచ్చన్నారు. నూగులో వైఎల్‌ఎం-66,11,17 వంటి రకాలు మంచి ఫలితాలను ఇస్తాయన్నారు. అలాగే వేరుశగనలో టీసీజీఎస్-1694 విత్తనం విత్తు కోవాలనుకునే రైతులు తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం నుంచి విత్తనాలను పొందవచ్చన్నారు. పెసరలో ఎల్‌జీజీ 460, 407, టీఎం96-2, ఐపీఎం2-14, డబ్ల్యుజీజీ-42 వంటి రకాలను విత్తుకోవచ్చన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు దృష్టి సారించాలన్నారు. తద్వారా తక్కువ పెట్టుబడులతో అధిక ఆదాయం గడించవచ్చన్నారు. వీఏఏ బాబు, రైతులు పాల్గొన్నారు.

వృథాగా పోతున్న బుగ్గవంక డ్యామ్ నీరు



చింతకొమ్మదిన్నె : బుగ్గవంక డ్యామ్ నుంచి రెడ్డిచెరువుకు నీరు నింపడానికి బుగ్గవంక ఎడమ కాలువ నుండి నీరు వదిలారు. అయితే రెడ్డిచెరువు నెల రోజుల కిందటే నిండినప్పటికీ అధికారులు పట్టించుకోక పోవడంతో రెడ్డిచెరువు నిండి వృథాగా పోతోందని స్థానిక రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుగ్గవంక డ్యాములో నీరు నిలువవుంటే రానున్న వేసవి కాలానికి భూగర్భ జలాల స్థాయి పెరుగుతుందన్నారు. వేసవి కాలానికి బోర్లు ఎండిపోకుండా ఉంటాయన్నారు. ఇరిగేషన్ అధికారులు వృథాగా పోతున్న నీటిని పరిశీలించి, బుగ్గడ్యాం నీటి వృథాను ఆపాలని మండల రైతులు, ప్రజలు కోరుతున్నారు.

కోడి పందెంరాయుళ్ల అరెస్టు

లింగాల : మండలంలోని అంబకపల్లె ఘాట్ దగ్గర గురువారం ఉదయం కోడి పందేల స్థావరాలపై దాడిచేసి 8 మంది కోడి పందెంరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. తమకు సమాచారం రావడంతో పోలీసు సిబ్బందితో దాడి చేసి 9 కోళ్లతోపాటు రూ.8730 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

శుభాకాంక్షల వెల్లువ


అంజద్‌బాషాను సన్మానిస్తున్న యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య


అంజద్‌బాషాను సన్మానిస్తున్న జయచంద్రారెడ్డి, దాసరి శివప్రసాద్ తదితరులు

కడప కార్పొరేషన్: రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా నూతన కడప సిటీ అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అజ్మతుల్లా, కో ఆప్షన్ సభ్యులు హారున్ బాబు, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఇబ్రహీం మియా, నాయకులు బలరాం, ఫజల్, పీరు, మౌలా, మన్సూర్, డెక్కన్ బిలాల్, రాజా తదితరులు పాల్గొన్నారు.

- మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్ బాష ను వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడిగా నియమించడం పట్ల ఆ పార్టీ నాయకులు కార్యకర్తల్లో హర్షం వ్యక్తమవుతోంది. గురువారం ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పి.జయ చంద్రారెడ్డి, ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్, సౌత్ సోన్ అధ్యక్షులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నార్త్ జోన్ అధ్యక్షులు బీహెచ్ఇయస్ ఇలియాస్ తదితరులు ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రఘునాథ రెడ్డి, రమేష్, అబ్దుల్ సుభాన్ తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా గొబ్బెమ్మ నిమజ్జనం

కడప కల్చరల్ : కడప నగరంలోని శంకరాపురంలో మహిళల ఆనందోత్సాహాల మధ్య గురువారం సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటుతూ కొనసాగాయి. స్థానిక శంకరాపురం బెస్తవీధి లోని గంగమ్మ గుడి వద్ద స్థానిక మహిళలు అందరూ ఒక్కటై ఏర్పాటు చేసిన గొబ్బెమ్మకు మహిళలు, ప్రజలు నీరాజనం పలికారు. అంతకుముందు గంగమ్మ గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. గొబ్బెమ్మకు గొబ్బియలు పాటలు పాడుతూ కోలాటాలు చేస్తూ, డ్రమ్ములు వాయిస్తూ, మహిళలు అందరూ కూడా ఒకే రకమైన దుస్తులు ధరించి నాట్యాలు చేస్తూ గొబ్బెమ్మ కు సంబరాలు చేశారు. స్థానిక మహిళలతో పాటు , యువత , చిన్నారులు కూడా ఈ కార్యక్రమంలో ఉత్సాహభరితంగా పాల్గొన్నారు. కోలాట ప్రదర్శనను తిలకించేందుకు జనం బారులు తీరారు. అనంతరం కడప నగర శివార్లలోని వాటర్ గండి వద్దకు తీసుకువెళ్లి అక్కడ పెన్నా నదిలో గొబ్బెమ్మ ను ఘనంగా నిమజ్జనం చేశారు. అనంతరం గంగమ్మ గుడి వద్ద స్థానిక ప్రజలకు భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.


కోలాట ప్రదర్శనలో మహిళలు, చిన్నారులు

శంకరాపురంలో కాలిపోతున్న లైట్లు, ఫ్యాన్లు


కాలిపోయిన ఫ్యాన్


కాలిపోయిన స్విచ్ బోర్డు

కడప కార్పొరేషన్: కడప నగరంలోని శంకరాపురంలో కొన్ని ఇళ్లలో ఫ్యాన్లు, లైట్లు, రిఫ్రిజిరేటర్లు, ఏసీలు తరచుగా కాలిపోతున్నాయి. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై స్థానిక ఏపీఎస్‌పీడీసీఎల్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా హై ఓల్టేజీ వల్ల ఏర్పడుతోందని తాత్కాలిక చర్యలు చేపడుతున్నారే గానీ శాశ్వతంగా సమస్యను అరికట్టలేదని చెబుతున్నారు. శంకరాపురంలో డోర్ నంబర్ 41/320-1లో భారతీ బార్ రామాలయం వద్ద చంద్రశేఖర్ అనే వ్యక్తి ఉంటున్న ఇంటిలో ఇప్పటికి మూడుసార్లు ఇలా ఫ్యాన్లు, లైట్లు కాలిపోయాయి. పక్క ఇంటిలో, ఎదురుగా ఉన్న ఇళ్లలో కూడా ఇలాగే ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, స్విచ్ బోర్డులు కాలిపోయాయి. ఇలా కాలిపోకుండా చర్యలు తీసుకోవాల్సిన విద్యుత్ శాఖ అధికారులు కిందిస్థాయి సిబ్బందిని పంపి తాత్కాలిక చర్యలు తీసుకుంటున్నారని, దీనివల్ల తాము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఇలా షార్ట్ సర్క్యూట్ జరక్కుండా చూడాలని వారు కోరుతున్నారు.

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగుళూరులో కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఫౌండేషన్ అడ్మిషన్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 18-28 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి టెన్త్ పాస్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్/ఫెయిల్ అయినవారు అర్హులన్నారు. 35 రోజులపాటు శిక్షణ కొనసాగుతుందని, శిక్షణా కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారన్నారు. ఇతర వివరాలకు 90004 87423 నెంబరులో సంప్రదించాలన్నారు.

అక్రమ ఖనిజంతో సంబంధం లేదు

– బండి జకరయ్య

కడప కోటిరెడ్డిసర్కిల్ : టిఫిన్ కంపెనీకి బెరైటీస్‌తో మా కంపెనీకి ఎలాంటి సంబంధం లేదని బండి జకరయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు ఎప్పుడైనా, ఎవరైనా తనిఖీ చేసుకోవచ్చని, పద్ధతిగా వ్యాపారం చేయడం మినహా ఎలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడలేదని వివరించారు. టిఫిన్ కంపెనీకి చెందిన బెరైటీస్ అక్రమంగా తమ కంపెనీలోకి తరలించినట్లు ఆరోపణలు రావడం దురదృష్టకరమన్నారు. కొన్నేళ్లుగా మినరల్స్ వ్యవహారంలో వ్యాపార కార్యకలాపాలు చేస్తున్నామని, నిబద్ధతతో వ్యవహరించడం మినహా అక్రమాలకు పాల్పడే అలవాటు తమకు లేదని స్పష్టం చేశారు.

ఎన్నికల హామీలు నిలబెట్టుకోకుంటే ఉద్యమిస్తాం



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్: ఎన్నికల ప్రచార సమయంలో ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇచ్చిన ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయకపోతే ఉద్యమిస్తామని ఎస్టీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథ్ రెడ్డి హెచ్చరించారు. కడపలోని ఎస్టీయు భవన్‌లో గురువారం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయులు వారి జీతాలు మినహా మరి ఏ ఇతర ఆర్థిక పరమైన లబ్ధి పొందలేదన్నారు. 12వ వేతన సవరణ సంఘం సంబంధించిన కమిషన్ ఏర్పాటు ప్రక్రియ మొదలే పెట్టలేదని, ఇప్పటికే 19 నెలలు ఆలస్యమైందన్నారు. వెంటనే ప్రభుత్వం మధ్యంతర భృతిని ప్రకటించకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు అవుతోందని, ఇప్పటికీ ఎన్నికల హామీలైన బకాయిల చెల్లింపు, 12వ పీఆర్సీ అంశాలపై ఉద్యోగ సంఘాలను చర్చలకే ఆహ్వానించడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొర్ర సురేష్‌బాబు, కంభం బాలగంగి రెడ్డి , జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇలియాస్ బాష, నర్రెడ్డి సంగమేశ్వర్ రెడ్డి, నాయకులు రవిశంకర్ రెడ్డి, చెన్న కేశవ రెడ్డి, రెడ్డన్న, వెంకట సుబ్బయ్య, సాదిక్, జయరాం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సురక్షిత ప్రయాణానికి మారుపేరు


మాట్లాడుతున్న డీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీ అంటే సురక్షిత ప్రయాణానికి మారుపేరని జిల్లా రవాణాశాఖ ఉప కమిషనర్ ఎ.చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం డిపో మేనేజర్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా మాసోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన డీటీసీ మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు డ్రైవింగ్‌లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. ప్రమాదాలు జరగకుండా ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహన కల్పించే చర్యలు చేపట్టాలన్నారు. ఘాట్‌రోడ్డులో డ్రైవింగ్ చేసే సమయంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నగరంలో వాహనాలు నడిపే సమయంలో జాగరూకతతో వ్యవహరించాలన్నారు. నైట్ సర్వీసుకు వెళ్లే డ్రైవర్లలో కంటి చూపులో తేడా ఉన్న వారు విధులకు వెళ్లకుండా ఉండడం మంచిదన్నారు. ఆర్ఎం గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ప్రమాదాలు చేసిన డ్రైవర్లకు విడతల వారీగా శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ శిక్షణను ప్రతి ఒక్క డ్రైవరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు మాట్లాడుతూ డ్రైవర్లు ఇంధన పొదుపుతోపాటు క్షేమకరమైన డ్రైవింగ్‌పై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ కన్యాకుమారి, ఎస్టీఐ మంజుల, నాగమణి, లలితమ్మ, డీఎం ఆఫీసు సూపరింటెండెంట్ అల్లాబకష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మానాన్నకు సాయంగా..




సంక్రాంతి వరుస సెలవులు రావడంతో తల్లిదండ్రులకు చేదోడుగా చిన్నారులు నిలిచారు. వంట చెరుకు కట్టెలను భారంతో మోసుకొని ఇంటికి తీసుకువచ్చారు. బుగ్గవంక నుంచి ఐటీఐ వద్ద ఈ దృశ్యాలు కనిపించాయి.

- సాక్షి ఫొటోగ్రాఫర్, కడప